క్లుప్తంగా

నేడు గ్రామాల్లో మంత్రి అంబటి పర్యటన

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 10వ తేదీన మేదరమెట్ల వద్ద నిర్వహించనున్న సిద్ధం సభను జయప్రదం చేసేందుకు జన సమీకరణలో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం ఉదయం పలు గ్రామాల్లో పర్యటించనున్నారని ఆయన కార్యాలయ వర్గం మంగళవారం తెలిపింది. బుధవారం ఉదయం 6.30 గంటలకు బుల్లెట్ వాహనంపై బయలుదేరి ర్యాలీగా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం, నందిగం, గుడిపూడి, లక్ష్మీపురం, ఫణిదం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఫణిదం గ్రామంలో అల్పాహార విరామం అనంతరం భట్లూరు, కట్టమూరు, దీపాలదిన్నె పాలెం, అబ్బూరు, గండ్లూరు గ్రామాల్లో పర్యటన జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తూనికలు కొలతల శాఖ తనిఖీలు



సత్తెనపల్లి: పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కుంభకర్ణ రెస్టారెంట్, శ్రీ గణేష్ సాయి మెస్, పుల్లారావు మెస్, పెద్ద మసీదు సెంటర్‌లోని రైస్ మిల్లులో ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేశారు. రైస్ మిల్లులో 26 కేజీల బియ్యం బస్తా 24 కేజీలు మాత్రమే ఉండగా రెండు కేజీలు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. నిర్దేశించిన తూకాల కంటే తక్కువ ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్ సైదా హెచ్చరించారు. ఆయనతోపాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

రాజుపాలెం: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు ఎన్.హరిబాబు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలకు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఫారం-6, ఫారం-7, ఫారం-8ల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముప్పాళ్ల: పురుగు మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తొండపి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన వల్లెపు గోపి (24) సత్తెనపల్లిలోని ఒక ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత నెల 29న ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఘటనపై ఏఎస్ఐ ఇమామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

550 పశువులకు గాలికుంటు టీకాలు

బెల్లంకొండ: గాలికుంటు వ్యాధి సోకడంతో మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల పశు వైద్యాధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలో సుమారు 550 ఆవులు, గేదెలకు గాలికుంటు టీకాలు వేసినట్లు తెలిపారు. అదే విధంగా 150 దూడలకు డీవార్మింగ్ చికిత్స, 50 పశువులకు సాధారణ వైద్య చికిత్సలు చేసినట్లు తెలిపారు. పశు పోషకులు పశువుల సంరక్షణలో నిరంతరం పశు సంవర్థక సిబ్బంది సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేసు మల్లీశ్వరి బ్రహ్మం, ఎంపీటీసీ చిట్టెంశెట్టి శివనాగమణి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, వెటర్నరీ అసిస్టెంట్లు అరుణ, భార్గవ్, దేవయ్య, వెంకటేశ్వర్లు, చేవూరి కొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

అచ్చంపేట: అయిష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ మోటివేటర్ ఎస్.రఘురామ్ తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్ స్కూలులో స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరీక్షకు ముందు మనస్సు ప్రశాంతంగా ఉంచుకుంటే, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు యోగా చేయించారు. ఏవిధంగా సమాధానాలు రాస్తే ఎక్కువ మార్కులు సాధించవచ్చో వివరించారు. స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, స్నేహ హస్తాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం .. రోజుకో వంటకం

- ప్రభుత్వ బడుల్లో నిండుగా జగనన్న గోరు ముద్ద
- వారంలో ఐదు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- భోజనం చేస్తున్న 87 శాతం విద్యార్థులు



75త్యాళ్ళూరు విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద అందిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించే లక్ష్యంతో జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో వండి వడ్డించే నాసిరకం మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు అధిక శాతం మంది ఇళ్లకు వెళ్లి తిని వచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం సకల వసతులు సమకూర్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలరని భావించి మధ్యాహ్న భోజన పథకానికి జగనన్న గోరు ముద్దగా కొత్త రూపునిచ్చి అమలు చేస్తోంది. సంపూర్ణ పౌష్టికాహారం అందేలా మెనూ రూపకల్పన చేసింది. రోజుకో వంటకం తయారు చేసి విద్యార్థులకు అందించే ఏర్పాటు చేసింది. వారంలో ఐదు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇస్తున్నారు. ఇప్పుడు జగనన్న గోరుముద్దతో రుచికరమైన పౌష్టికాహారం అందుతుండడంతో పాఠశాలల్లోనే పిల్లలు భోజనం చేస్తుండడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్లేట్ నిండుగా జగనన్న గోరు ముద్ద

మండలాల వారీగా వివరాలు ఇలా..

మండలం పేరు	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు	మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు
పెదకూరపాడు	41	3850	2686
అమరావతి	57	4894	3534
క్రోసూరు	58	6984	5070
అచ్చంపేట	63	7011	5155
బెల్లంకొండ	25	3460	2043
సత్తెనపల్లి	93	12324	7760
ముప్పాళ్ల	34	4472	2755
రాజుపాలెం	55	5753	4149
నకరికల్లు	44	6573	5637

పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాలలో విద్యార్థులు ఇలా..

పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 87 శాతం మంది విద్యార్థులు రోజుకు సగటున జగనన్న గోరు ముద్ద తింటున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో మొత్తం 244 ప్రభుత్వ పాఠశాలల్లో 26,199 మంది విద్యార్థులకు గాను 18,488 మంది, సత్తెనపల్లి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొత్తం 226 ప్రభుత్వ పాఠశాలల్లో 29,122 మంది విద్యార్థులకు గాను 20,301 మంది జగనన్న గోరు ముద్ద తింటున్నారు.

భోజనం రుచికరంగా చేస్తున్నారు..



జగనన్న గోరు ముద్ద రుచికరంగా చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం సిద్ధం అవుతోంది. రోజుకు ఒక వంట సిద్ధం చేస్తున్నారు. వారంలో ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్డు ఇస్తున్నారు. మేము ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన పోషకాలు ఉన్న ఆహారాన్ని అందిస్తున్నారు.

–నందిని, పెదకూరపాడు

మేమంతా ఇక్కడ భోజనం చేస్తున్నాం..



భోజనం రుచికరంగా ఉంటుంది. గతంలో ఇంటికి వెళ్లి తినేవాళ్లం. ఇప్పుడు పాఠశాలలోనే భోజనం చేస్తున్నాం. కోడిగుడ్డుతో పాటు చిక్కీ కూడా అందిస్తున్నారు. మా స్నేహితులు అందరం ప్రతి రోజు మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నాం. రోజుకో వంటకం వండుతున్నారు.

–షేక్ రహ్మతుల్లా, పెదకూరపాడు

87 శాతం మంది తింటున్నారు..



పెదకూరపాడు నియోజకవర్గంలో 87 శాతం మంది రోల్ ప్రకారం జగనన్న గోరు ముద్ద తీసుకుంటున్నారు. పక్కాగా పర్యవేక్షణ చేస్తున్నాం. పిల్లలకు పోషక విలువలతో కూడిన భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

–ఏకుల ప్రసాదరావు, ఎంఈవో, పెదకూరపాడు

అక్కచెల్లెమ్మలకు సర్వ హక్కులతో రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత



మహిళకు రిజిస్ట్రేషన్ పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు, తహసీల్దార్ సువర్ణ

క్రోసూరు: చంద్రబాబు మాయమాటలతో అక్కచెల్లెమ్మలను మోసం చేస్తే, సీఎం జగన్ పాలనలో అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు అందజేసి వాటికి రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కులు కల్పించటం జరిగిందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం క్రోసూరు మండల పరిధిలో జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారులైన మహిళలకు అందజేశారు. క్రోసూరు మండల పరిధిలో మొత్తం 2,430 మంది మహిళలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని సీఎం వైఎస్ జగన్ కొత్త చరిత్ర సృష్టించారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఇప్పటికీ రిజిస్ట్రేషన్ లేదన్నారు. కానీ జగనన్న అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం ఆస్తి ఇచ్చి దానిపై సర్వహక్కులు ఇచ్చారన్నారు. వీటితో ప్రతి అక్కచెల్లెమ్మకు సుమారు రూ.10 లక్షల విలువైన ఆస్తి దక్కుతుందన్నారు. ఇళ్లస్థలాలతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు కూడా ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. జగనన్న కాలనీలకు పూర్తి వసతులను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎన్నికల తర్వాత జగనన్న కాలనీల్లో సిమెంట్ రోడ్లు కూడా వేయబోతున్నామన్నారు. ఇప్పుడు మరోసారి బూటకపు హామీలతో ఎన్నికలకు వస్తున్నారని మండిపడ్డారు. 2019–24 మధ్య ఏం చేశామో చెప్పి ఓట్లు అడిగే ధైర్యం తమ ప్రభుత్వానికి ఉందని.. 2014–19 మధ్య ఏం చేశారో చెప్పగలిగే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. అందుకే డ్వాక్రా మహిళలు, ఆసరా, చేయూత వంటి పథకాలు అందుకుంటున్న అక్కచెల్లెమ్మలు జగనన్నకు అండగా ఉండి మరోసారి గెలిపించాలని కోరారు. తహసీల్దార్ ఎం.సువర్ణ, యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ షేక్ జమీల, ఎంపీపీ పి.కోటయ్య, సత్యనారాయణరెడ్డి, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, వీఆర్వో బ్రహ్మనాయుడు, ఎంపీటీసీ రవికుమార్, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు మేమున్నామని..



పట్టణంలో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు, పోలీసులు

సత్తెనపల్లి: ప్రజల భద్రతకు మేమున్నామని .. ప్రతి ఒక్కరూ నిర్భయంగా రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ డీ రామచంద్రరాజు అన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం నుంచి పురవీధుల్లో మంగళవారం సాయుధ బలగాలు, పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ప్రతి ఒక్కరికి ఆయుధం అన్నారు. ఓటును వినియోగించుకుని ఉత్తమ నాయకులను ఎన్నుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున బలగాలతో తాము భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గుర్నాథ్ బాబు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ, సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, అమరావతి సీఐలు పీ ప్రభాకర్, మీసాల రాంబాబు, ఏవీ బ్రహ్మం, సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌వో రాజేష్, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐలు సంధ్యారాణి, సత్యనారాయణ, సాయుధ బలగాలు, పోలీసులు ఉన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్తెనపల్లి ఆర్డీ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల విధులను సెక్టోరియల్, పోలీస్ సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల విధులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సూచనలు, నిబంధనల మేరకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. ఎప్పటికప్పుడు వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన మొదలుకొని పోలింగ్ ప్రక్రియ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచే వరకు సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. నార్మల్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు వాటి మ్యాపింగ్ పోలీస్ సెక్టోరియల్ అధికారులతో కలిసి సదరు గ్రామాలను సందర్శించాలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా 59 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటి సంఖ్య పెరగనుందన్నారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, ఫర్నిచర్, వీల్ చైర్స్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, అప్రోచ్ రోడ్లు, వెబ్ క్యాస్టింగ్ చేయుటకు విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. సరస్వతి శిశు మందిర్ పాఠశాల నుంచి ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే స్ట్రాంగ్ రూంను హోలీ ఫ్యామిలీ ఈఎం పాఠశాలకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే వృద్ధుల వయసు 85 సంవత్సరాలు ఉండాలన్నారు. ఆయా సమావేశాల్లో పట్టణ సీఐ పీ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఏఈఆర్వోలు, తహసీల్దార్లు ఉష (సత్తెనపల్లి), సింగారావు (ముప్పాళ్ళ), హరిబాబు(రాజుపాలెం), లక్ష్మీనారాయణ(నకరికల్లు), ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోసుబాబు, 31 మంది సెక్టోరియల్ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెం గిరిజన రైతులకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు జగనన్న శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావలసినదిగా కోరారు.

నేడు దుకాణాల లీజు హక్కులకు వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న పలు దుకాణాలు, హక్కులకు సంబంధించి వేలం పాటలను బుధవారం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయం పరిధిలో కొబ్బరి కాయలు, పూజాద్రవ్యాలు విక్రయం, కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణ, ప్రసాదాలు విక్రయం, క్యాంటీన్ ఏర్పాటుకు సంబంధించిన పలు దుకాణాలపై ఏడాది పాటు హక్కుల కోసం ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు సిబ్బందిని సంప్రదించి, వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

అమ్మవారి తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

దుర్గి: ప్రసిద్ధిగాంచిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా మంళవారం ఆలయ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 24, 25 తేదీలలో జరుగు తిరునాళ్ల సందర్భంగా భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ఆలయ డీసీ సహాయ కమిషనర్ పైడమ్మబాయి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖాధికారులు సహాయ సహకారాలందించి తిరునాళ్లను జయప్రదం చేయాలని కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశానుసారం అధికారులందరూ కలిసిరావాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఫణీంద్ర, అర్చకులు శేషాచార్యులు, విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, రామయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు శిక్షణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో బుధవారం నియోజకవర్గంలోని 24 మంది సూపర్‌వైజర్లు, 274 మంది బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోల)కు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ సీహెచ్ ఉష మంగళవారం తెలిపారు. ఈ శిక్షణకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీ కృష్ణ, ఏఈఆర్‌వోలు హాజరవుతారన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి

పిడుగురాళ్ల: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో శ్రీనివాసకాలనీ వద్ద వైఎస్సార్ విగ్రహ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ కరిముల్లా (20) ప్రమాదవశాత్తు రైలు కింద పడటంతో అతని రెండు కాళ్లు వేరయ్యాయి. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు అవ్వలేదని పోలీసులు తెలిపారు.

ఆటోనగర్ శ్రామికులకు అండగా ఉంటాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో ఆటోనగర్ వర్కర్స్ అండ్ యూనియన్ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, సత్తెనపల్లి ఆటోనగర్ అభివృద్ధిని కొనసాగిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని ఆటోనగర్ వర్కర్స్ అండ్ యూనియన్ మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటోనగర్‌లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. విస్తీర్ణం పెంచేందుకు, అందుకు అవసరమైన వనరులు కల్పించేందుకు కచ్చితంగా కృషి చేస్తామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలలో విశేషమైన ఆదరణ ఉందన్నారు. ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని, పారదర్శక సంక్షేమం అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ సభ్యులు ఆటోనగర్‌లోని పలు సమస్యలను మంత్రి అంబటి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందని, సమస్యలన్నిటినీ ప్రాధాన్య క్రమంలో పరిష్కరించి, అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మంత్రి అంబటిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఎస్ఎం యూనస్, ఆటోనగర్ వర్కర్స్ అండ్ యూనియన్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ గౌస్, సెక్రటరీ వడ్డెరపు శ్రీనివాసరావు, వైస్ సెక్రటరీ నేలపాటి కోటేశ్వరరావు, సభ్యులు ముస్తఫా, షఫీ, మాబుజానీ, ఘన్‌సైదా, షుకూర్, శ్రామికులు, తదితరులున్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దాం

- పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రభుదాస్



సమావేశానికి హాజరైన పాస్టర్లు, దైవ సేవకులు

అమరావతి: రాష్ట్రంలోని పేదలందరికీ అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాస్టర్స్, క్రైస్తవ సంఘాలు మద్దతు తెలపాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రభుదాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దిడుగు ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి పాస్టర్ పీటర్ పాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలో చెప్పిన నాయకుడి లక్షణాలు సీఎం జగన్‌లో ఉన్నాయని అటువంటి వారిని దేవుడు తప్పక ఆశీర్వదిస్తాడన్నారు. ఈ ప్రభుత్వం కొనసాగాలని, పేదలకు అందే సంక్షేమ పథకాలు ఆగకుండా ఉండాలని ప్రతి రోజు క్రీస్తు ఆరాధకులు ప్రార్థించాలన్నారు. పాస్టర్ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ నిరుపేదలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అందరు ఆశీర్వదించాలన్నారు. రాష్ట్రంలో 8,500 మంది పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చి గౌరవించిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. భవిష్యత్‌లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటానికి దైవసేవకులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు నంబూరు వసంతకుమారి మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు, పాస్టర్లకు, దైవసేవకులకు అండగా నిలుస్తామన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా శంకరరావును మరొక్కసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సమావేశంలో పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు రావెల అశోక్‌కుమార్, బాబురావు, ఏలిషా, ప్రకాష్‌లతో పాటు 200 మంది పాస్టర్స్, దైవసేవకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



గరికపాడు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దొడ్లేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాద్

క్రోసూరు: గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో మండలంలోని రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు మంగళవారం కొనసాగాయి. దొడ్లేరు సెక్టార్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మహమ్మద్ సాద్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొని మండలంలోని గాదెవారిపాలెం, గరికపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరాల కేసులు రాలేదని, తగ్గుముఖం పట్టినట్లు వైద్యుడు సాద్ తెలిపారు. వచ్చిన ఆరుగురు సాధారణ ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారని తెలిపారు. వారందరికీ పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. మరి కొంత మంది బీపీ, షుగర్ రోగాలకు వైద్యం చేయించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా గాదెవారిపాలెంలో జ్వరాల కేసులు లేవని, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న ఏడుగురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు చెప్పారు. కొంతమంది బీపీ, షుగర్ రోగాలకు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే గుడిపాడులోనూ జ్వరాల కేసులు లేవని, సాధారణ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. బుధవారం గాదెవారిపాలెంలో వైద్య శిబిరం కొనసాగిస్తామని డాక్టర్ వివరించారు.

నకరికల్లు ఎస్ఎస్ ట్యాంకుకు నీటి విడుదల



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నింపుతున్న దృశ్యం

నకరికల్లు: స్థానిక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును సాగర్‌జలాలతో నింపుతున్నట్లు నరసరావుపేట మున్సిపల్ ఏఈ రమావతు రాములునాయక్ మంగళవారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సాగర్ కుడికాలువకు నీటిని విడుదల చేసిన విషయం విదితమే. కాగా నకరికల్లు, రొంపిచర్ల మండలాల్లోని గ్రామాలతో పాటు నరసరావుపేట పట్టణానికి తాగునీటిని అందించేందుకు గాను స్థానిక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపుతున్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ నకరికల్లులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నీటి సామర్థ్యం 131.5 మీటర్లు కాగా ప్రస్తుతం 128.25 మీటర్ల మేర నీటినిల్వ ఉందన్నారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా కుడికాలువ నుంచి ట్యాంకును నీటితో నింపుతున్నట్లు తెలిపారు. వేసవికాలంలో 35 నుంచి 40 శాతం ఆవిరి అయ్యే పరిస్థితులు తలెత్తనున్నందున తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రక్షిత మంచినీటిని అందరికీ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

పోలింగ్ నిర్వహణలో బీఎల్‌వోల పాత్ర కీలకం



బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న ఏఆర్వో ప్రభాకరరావు



ఈవీఎంల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ శిక్షకులు రాయపూడి సాంబశివరావు

పెదకూరపాడు: పోలింగ్ నిర్వహణలో బీఎల్‌వోల పాత్ర కీలకమని ఏఆర్వో జె.ప్రభాకరరావు అన్నారు. పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో చిత్తశుద్ధి కలిగి ఉండాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ శిక్షకులు రాయపూడి సాంబశివరావు ఈవీఎంల నిర్వహణ, ఇంటి నుంచి ఓటు ఎలా వేయాలని, ఏఎస్‌డీ జాబితా, పీడబ్ల్యూడీ జాబితా తయారీ, ఎస్ఈఎస్ వీఈఈపీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని 266 బూత్‌ల బీఎల్‌వోలు ఐదు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.